

## ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు

బాలానగర్: అయోధ్య నుంచి వచ్చిన రామయ్య అక్షింతలను శుక్రవారం విజ్ఞానపురికాలనీలో రామభక్తులు ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అయోధ్య రామయ్య ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకొని అక్షింతలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామభక్తులు, కాలనీవాసులు భారీగా పాల్గొన్నారు.

**పాపిరెడ్డినగర్‌కు శ్రీరాముడి అక్షింతలు**

కూకట్‌పల్లి: అయోధ్య నుంచి పాపిరెడ్డినగర్ వీరాంజనేయ శివాలయంలో అయోధ్య నుంచి శ్రీరాముల అక్షింతలను శుక్రవారం పాపిరెడ్డినగర్ పురవీధుల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అక్షంతలను ఇంటింటికీ పంపిణీ చేశామని భక్తులు భూపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మంగళ హారతులతో కొబ్బరికాయలు కొట్టి స్వాగతం పలికి స్వామివారి ఉత్సవ విగ్రహాలను దర్శనం చేసుకున్నారు.



విజ్ఞానపురికాలనీలో అక్షింతలు పంపిణీ చేస్తున్న రామభక్తులు

# నిద్రపోతున్న విజిలెన్స్

- నిబంధనలకు మించి విద్యుత్ మీటర్ల ఏర్పాటు
- ప్యానల్ బోర్డులు ఏర్పాటు చేయకుండానే మీటర్లు బిగిస్తున్న వైనం
- పట్టించుకోని సంబంధిత శాఖ ఉన్నతాధికారులు




గతేడాది డిసెంబర్ 28న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం



ప్రాగా టూల్స్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా విడివిడిగా ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్లు

కుత్బుల్లాపూర్: విద్యుత్ మీటర్ల ఏర్పాటు విషయంలో లైన్‌మెన్‌లు చేతివాటం ప్రదర్శిస్తూనే ఉన్నారు. దీంతో విద్యుత్‌శాఖ ఖజానాకు భారీగా గండి పడుతోంది. మేడ్చల్ డివిజన్ కుత్బుల్లాపూర్ ఏడీఈ పరిధిలో ప్రాగాకాలనీలో ఓ ఇంటి నిర్మాణం పూర్తి కాగా నాలుగు మీటర్ల కంటే ఎక్కువగా ఏర్పాటు చేస్తే ప్యానల్ బోర్డు తప్పనిసరి. కానీ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వివిధ కాలనీలు, ప్రధాన రోడ్లపై నిర్మిస్తున్న నిర్మాణాలకు లంచాలు తీసుకుని మీటర్లు బిగిస్తున్నారు.

◆ ఇటీవల సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డులో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన నిర్మాణానికి రెండు త్రీఫేజ్ మీటర్లు, ఆరు సింగిల్ ఫేస్ మీటర్లు ఇచ్చిన విషయంపై 'సాక్షి'లో వచ్చిన కథనం మర్చిపోకముందే తాజాగా మరో సంఘటన జీడిమెట్ల డివిజన్ ప్రాగాకాలనీలో ఒకే ఇంటికి ఆరు సింగిల్ ఫేజ్ మీటర్లు ఏర్పాటు వెలుగులోకి రావడం విశేషం.

◆ స్థానికంగా విధులు నిర్వహించే లైన్‌మెన్ గత ఏడు సంవత్సరాలుగా ఇక్కడే ఉంటూ కొత్తగా వచ్చే అధికారులను తన గుప్పెట్లో ఉంచుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అడ్డగోలుగా సంపాదించాడని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ లైన్‌మెన్‌కు మేడ్చల్ డివిజన్ ఓ ఉన్నతాధికారి అండదండగా ఉండడం మూలంగా రెచ్చిపోతున్నాడని తోటి ఉద్యోగులే పెదవీరుస్తున్నారు.

**చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు...**

మేడ్చల్ విద్యుత్ డివిజన్ పరిధిలో చోటు చేసుకుంటున్నా అక్రమాలపై విజిలెన్స్ విభాగం అధికారులు వివరిస్తున్న తీరు పలు అనుమానాలకు దారితీస్తున్నాయి. ఒకే ఇంటికి అధిక సంఖ్యలో మీటర్లు బిగిస్తే విజిలెన్స్ విభాగం అధికారులు తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది. కానీ ఇక్కడ జరుగుతున్న అక్రమాలపై ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

◆ ఇటీవల సుభాష్ నగర్ పైప్‌లైన్ రోడ్డులో జరిగిన సంఘటన విషయంపై డిసెంబర్ 28వ తేదీన 'సాక్షి'లో వచ్చిన కథనం ఆధారంగా సంబంధిత లైన్‌మెన్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ మేడ్చల్ డివిజన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి జోక్యంతో విజిలెన్స్ విభాగం అధికారులు విచారణ చేపట్టకుండానే వెళ్లిపోవడం విశేషం.



ఇప్పటికైనా సంబంధిత అధికారులు పూర్తి విచారణ చేపట్టి విద్యుత్తు ఆదాయానికి గండి కొట్టే వారిపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తా..**

సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డులో అక్రమంగా బిగించిన 8 మీటర్లను గుర్తించి ఫొటోలు తీసుకున్నానన్నారు. ఎస్‌ఈ, డీఈ, ఏడీఈలు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో బిజీగా ఉండడం మూలంగా నివేదిక అందజేయలేకపోయామని తెలిపారు. 6వ తేదీ తర్వాత నివేదిస్తానని పేట్‌బషీరాబాద్ విద్యుత్ ఏఈ జ్ఞానేశ్వర్ 'సాక్షి'అడిగిన వివరణకు సమాధానం ఇచ్చారు.

## హోమ్ హెల్త్ ఎయిడ్ కోర్సులో ప్రవేశాలు

**అభ్యర్థుల అర్హత పదో తరగతి**

కూకట్‌పల్లి: రాందేవ్‌రావ్ ఆస్పత్రిలో ఆరోగ్య భద్రతపై నైపుణ్యతను పెంచేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నారు. ఈనెల 8 నుంచి తరగతులు మొదలు కానున్నాయని నిర్వాహకులు తెలిపారు. హోమ్ హెల్త్ ఎయిడ్ కోర్సులో ప్రవేశాలకు ఆస్పత్రి వర్గాలు ఆసక్తి గలవారి వద్ద నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. 9 వారాల పాటు సాగే శిక్షణకు కనీసం 10వ తరగతి వరకు చదువుకున్న వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రామ్‌దేవ్‌రావ్ ఆస్పత్రి, కుముదిని దేవి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు.

## సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

- టాస్కులు, కమిషన్‌ల పేరుతో మోసం
- రూ.15 లక్షలు పోగొట్టుకున్న వైనం

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.15 లక్షల 18 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... అమీన్‌పూర్ పరిధిలోని వెంకటరమణ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ డిసెంబర్ 20 వ తేదీన తన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.3 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలు పెట్టాడు.కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్ లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.15 లక్షల 18 వేలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతో పాటు కమిషన్ నగదు చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## 7 నుంచి ఉద్యమకారుల కృతజ్ఞతా సభలు

హిమాయత్‌నగర్: ఉద్యమకారుల ఆవేదనను అర్థం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలోని 6 గ్యారంటీలలో ఉద్యమకారులకు 250 గజాల స్థలం, పెన్షన్‌ను చేర్చినందుకు ఈ నెల 7 నుంచి కృతజ్ఞతా సభలను నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఉద్యమకారుల కతజ్ఞత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారుల పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం కోసం కమిటీ వేయాలని, ప్రతి ఉద్యమకారుడికి గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యమకారులను తెలంగాణ స్వరాష్ట్ర సాధకులుగా గుర్తించాలని, ఉద్యమకారుల సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేసి రూ. 10 వేల కోట్లు బడ్జెట్ కేటాయించాలని, పెన్షన్, ఉచిత బస్, ట్రైన్ పాస్, ఆరోగ్య కార్డు, రూ. 20 లక్షల జీవిత బీమా ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ పునర్నిర్మాణం కోసం ప్రజా ప్రభుత్వానికి ఉద్యమకారులందరూ అండగా ఉంటారన్నారు.

## ఆర్ట్ ఎగ్జిబిషన్

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడలోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం 'మేరు అంతరాగ్ని' ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. సుమారు 400లకు పైగా ఆర్ట్ వర్క్ చేశారు. బెస్ట్ ఔట్ ఆఫ్ వేస్ట్, ప్రకృతిని కాపాడుతూ సేవ్ ఓషన్స్, శిల్పకళ, చార్‌కోల్, ఆక్రిలిక్, వాటర్ పెయింటింగ్ తదితరులను ప్రదర్శించారు. ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో పెయింటింగ్‌లను అమ్మకాలకు పెట్టారు. వచ్చిన డబ్బులను చారిటీకి అందిస్తామన్నారు. విద్యార్థులు కళల్లో తమ ప్రతిభ చాటేలా చేస్తున్నామన్నారు.

## ఆరు నెలలకోసారైనా వైద్య పరీక్షలు చేయించుకోవాలి



ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న తూము శ్రావణ్‌కుమార్

మోతీనగర్: ప్రతి ఒక్కరూ ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా పని చేయడంతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని.. కనీసం ఆరు నెలలకోసారైనా సాధారణ వైద్య పరీక్షలు చేయించుకోవాలని మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని బబ్బుగూడ కమ్యూనిటీహాల్‌లో ఏజీఐ గ్రీన్ ప్యాక్, ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు బసవయ్య, మానికరెడ్డిల పర్యవేక్షణలో వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, చెవి, ముక్కు, గొంతు, చర్మ, దంత వ్యాధులుతో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కనీసం మూడు నెలలకోసారి అయినా వైద్యులను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, యోగా వంటివి చేసినట్లయితే వ్యాధులు దరిచేరవన్నారు. గ్లాస్ ఫ్యాక్టరీ యాజమాన్యం చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తన్నీరు తిరుపతిరావు, మహమ్మద్ ఖాన్, బోడ శ్రీనివాసరావు, రాములు, నయీం పాషా, అజం, శ్రీధర్ గౌడ్, హరిబాబు, సుందర్, యాదయ్య, శేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 7న బాల బృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం బాల బృందావనం కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 9 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలకు పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా 'హ్యాపీ న్యూ యూవ్' పేరిట ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040-23001234లో సంప్రదించాలని సూచించారు.

## వేధింపులు ఎదురైతే ధైర్యంగా చెప్పండి



మాట్లాడుతున్న కమాండెంట్ సి.సన్నీ

గచ్చిబౌలి: మహిళా ఉద్యోగులు పని చేసే చోట వేధింపులు ఎదురైతే ధైర్యంగా చెప్పాలని టీఎస్‌ఎస్‌పీ 8వ బెటాలియన్ కమాండెంట్ సి.సన్నీ సూచించారు. శుక్రవారం కొండాపూర్ బెటాలియన్‌లో మహిళా ఉద్యోగుల లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ఎవరైనా మీ పట్ల లైంగిక ఇబ్బందులు కల్గించడం, అమర్యాదగా ప్రవర్తిండం చేస్తే కమిటీ సభ్యులకు ఫిర్యాదు చేయాలన్నారు. తోటి మహిళ ఉద్యోగులను అక్కా చెల్లెల్లుగా భావించి ప్రతి ఒక్కరు గౌరవించాలని ఆయన పేర్కొన్నారు. బెటాలియన్ క్యాంపస్‌లో పని చేస్తున్న మహిళ ఉద్యోగుల నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. కార్యక్రమంలో కొండాపూర్ బెటాలియన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.నిర్మల, సూపరింటెండెంట్ లక్ష్మీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బస్సులో మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ

భాగ్యనగర్‌కాలనీ: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ మెడలో నుంచి గొలుసు అపహరణకు గురైన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. డీఐ రాజేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... మోతీనగర్ అవంతినగర్‌లో నివాసముంటున్న ఆర్. సంగీతారెడ్డి పని నిమిత్తం ఎర్రగడ్డ నుంచి హైదర్‌నగర్ వరకు ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. జేఎన్‌టీయూ బస్‌స్టాప్ వద్ద బస్సు దిగింది. తన మెడలో ఉన్న 45 గ్రాముల బంగారు చైన్ కనిపించకపోవడంతో కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళ అదృశ్యం

జగద్గిరిగుట్ట: భర్తతో గొడవపడి ఓ మహిళ ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం, చంద్రగిరి నగర్‌కు చెందిన సమ్రీన్ బేగం(20), హబాబ్ ఖాన్ భార్యభర్తలు. నెల రోజులుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం ఉదయం 11గంటల సమయంలో ఎప్పటిలాగే చిన్న గొడవ కాస్తా పెద్దది కావడంతో చెప్పపెట్టకుండా ఇంట్లో నుంచి వెళ్లపోయింది. కుటుంబ సభ్యుల, చుట్టు పక్కల ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులని ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మతిస్థిమితం సరిగా లేని మహిళ అదృశ్యం



సరసవాణి (ఫైల్)

మూసాపేట: మతిస్థిమితం సరిగా లేని మహిళ అదృశ్యమైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ప్రసాద్, సరసవాణి (30) భార్యాభర్తలు. భార్య వాణి మతిస్థిమితం సరిగా లేదు. చికిత్స నిమిత్తం ఎర్రగడ్డ ఆస్పత్రిలో చూపించుకునే నిమిత్తం భర్తతో కలిసి హైదరాబాద్‌కు వచ్చింది. వీరు ఎర్రగడ్డలో దిగకుండా కూకట్‌పల్లిలోని బీజేపీ కార్యాలయం వద్ద దిగారు. అక్కడ బస్‌లో నుంచి లగేజ్ దించే సమయంలో సరసవాణి అక్కడి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేదు. దీంతో భర్త ప్రసాద్ కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమ నిర్మాణం కూల్చివేత

కూకట్‌పల్లి: హెచ్ఎంటీ శాతవాహననగర్‌లో అక్రమ నిర్మాణాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాన్ని డీసీపీ సుస్మితా, టీపీఎస్ సోమేశ్వర్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని కూల్చివేసిన అధికారులు

## 7న ముత్యాల ముగ్గుల పోటీలు

బాలానగర్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలను ఈనెల 7వ తేదీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా సంక్రాంతి పండుగ పురస్కరించుకొని దుర్గామాత గుడి ముందు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళలు పాల్గొనవచ్చని తెలిపారు. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలన్నారు. పోటీలో పాల్గొనే మహిళలు ఎవరి రంగులు వారే తెచ్చుకోవాలన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ముగ్గులు వేసిన ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలు 7386585979లో సంప్రదించాలని కోరారు.

## నెక్సస్ మాల్‌లో రంగోలి సందడి షురూ



కేపీహెచ్‌బీ కాలనీలోని నెక్సస్ మాల్

కూకట్‌పల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కూకట్‌పల్లిలోని నెక్సస్ మాల్‌లో సందడి మొదలైంది. నెక్సస్ మాల్‌లో రంగోలి పోటీ, అదే విధంగా చిన్నారులకు గాలి పటాలు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా సంక్రాంతిని పురస్కరించుకొని ఎండ్ ఆఫ్ సీజన్ సేల్ నిర్వహించనున్నారు. జనవరి 1 నుంచి 28 వరకు, అదే విధంగా 5 నుంచి 7వ తేదీల్లో అద్భుతమైన ఫ్లాట్ 50 తగ్గింపు అందించనున్నట్లు తెలిపారు. ఈ డిస్కౌంట్ సేల్ జనవరి 14వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జనవరి 13న రంగోలి పోటీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

## చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం



కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాచర్ల భద్రయ్య

కూకట్‌పల్లి: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, సీనియర్ నాయకుడు మాచర్ల భద్రయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు పాల్గొని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్ఎస్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.